

# 18

**వాడ్రేవు వీరలక్ష్మిదేవి**

అమ్మ నేను ఎనిమిదో క్లాస్‌లో ఉండగా చెప్పింది. రెండేళ్ల కొకసారి మళ్లీ మళ్లీ గుర్తుచేస్తూనే వచ్చింది. నా బుర్రని ఆ విధంగా 'ట్యూన్' చేసి పెట్టేసింది. చదువు తప్ప మరో లోకం ఉండకూడదు అన్నది ఆ ట్యూనింగ్. దాని ఫలితమే 'అనిమిష. ఎం.ఎస్.సి. ఫిజిక్స్ అయింది'. అనిమిష అంటే ఎవరో కాదు నేనే. ఇప్పుడు మేడమ్ కూడా అయ్యాను. ఫిజిక్స్ మేడమ్‌ని.

అమ్మ కల నిజం చేసుకుంది. ఆవిడ తెలుగు పండిట్. హైస్కూల్‌లో చాలా రోజులు 'గ్రేడ్-టూ'గానూ, తర్వాత 'గ్రేడ్-వన్'గానూ పనిచేసింది. తెలుగు సాహిత్యం విరివిగా చదివింది. ఎడతెరపిలేకుండా ఆలోచించి



# కూటి కోసం - కూలి కోసం

ఆ సాహిత్యాన్ని రక్తంలోకి వంపుకుంది. ఆ 'సారం' చెప్తూ వచ్చింది. సాహిత్యం లేకపోతే, ఉండి కూడా అది తెలియకపోతే మానవ జీవితాలకు వెలుగే లేదని చాలాసార్లు చెప్పి నా అవగాహనకు తెచ్చింది.

"మరి ఎందుకమ్మా! నాకీ భౌతికశాస్త్రం" అనే దాన్ని. నాకూ మా అమ్మలాగ సాహిత్యం మీద ప్రేమ.

"భౌతిక శాస్త్రపు పరిధులూ, పరిమితులూ కూడా తెలియాలమ్మా. అది తెలిస్తేనే సాహిత్యమయినా సరే, తత్వమయినా సరే మరింత బాగా వంటబడతాయి" అని అమ్మ జవాబు.

అమ్మ స్కూల్‌లో లెక్కల మాష్టారికి, సైన్సు మాష్టారికి ఉన్న క్రేజ్ తెలుగు మాష్టారికి లేదు. అమ్మ స్కూల్ ఒక్కటే కాదు. అన్నిచోట్లా అంతే.

"అందుకేనా! నన్ను ఈ చదువు వేపు తిప్పేవూ?" అని అడిగాను.

"అదేం కాదురా! చిన్నా! ఒక్క మాట చెప్పనా! రాబోయే కాలంలో నీ ఫిజిక్స్ పి.జి.కి నాకు వచ్చిన జీతం కూడా రాకపోవచ్చు. జీతాన్ని బట్టే చదువుకు విలువనిచ్చే రోజులు కూడా రావచ్చు. కాబట్టి – నీ చదువుకి కారణం అది కాదు" అంది.

అప్పుడు తెలీలేదు గాని ఇప్పుడనిపిస్తూ ఉంటుంది. అమ్మ ఎంత బాగా ఎంత దూరాన్ని చూడగలిగిందీ! అని.

× × ×

ముఖ్యంగా ఈ రోజు. ఈ రోజు ఉదయం కాలేజీకి రాగానే లేట్‌గా వచ్చానని నాకు మెమో ఇచ్చారు. నాకే కాదు. నాలాంటి ముప్ఫయి మంది లెక్చరర్స్‌కి. గత వారంలో మాకు తెలీకుండా నోట్ చేసి కళాశాల యాజమాన్యం జారీ చేసిన మెమోరాండంలు అవి –

ఎంత లేటుట? రెండు నిముషాలు, లేదా మూడు నిముషాలు ఎవ్వరూ అయిదు నిముషాలు లేట్‌లో లేరు.

మా కాలేజీ గవర్నమెంట్ ఎయిడ్‌తో నడిచే ప్రైవేటు కాలేజీ. కానీ చాలా కొద్ది మంది లెక్చరర్లకే గవర్నమెంటు ఎయిడ్‌తో జీతాలు వచ్చేది. మిగిలిన మేమంతా ఓ నలభైమందిమి ఎయిడ్ లేని లెక్చరర్లం.

ప్రభుత్వం తీసుకునే అనేకానేక నిర్ణయాలు సామాన్యులకు అర్థం కావు. అందులో ఒకటి గత ఇరవైఏళ్లుగా లెక్చరర్ల నియామకంపై ప్రభుత్వం విధించిన ఆంక్ష.

పది, పదిహేనేళ్లుగా కాలేజీ పాలకవర్గం ఇచ్చే రెండు వేల రూపాయల జీతానికి నాలాంటి 'ఎమ్.ఎస్.సి'లు 'ఎమ్మే'లు చాలామందిమే ఉన్నాం.

యూజీసీ అయిదవ కమీషన్ పుణ్యమా అని మా ఎయిడెడ్ లెక్చరర్లలో ఎవరికీ ఇరవై వేలకి తక్కువ జీతం లేదు. కొందరికి ఆ అంకె ముప్ఫయి కూడా దాటిపోతుంది.

ఈ వేతన అసమానత గురించి మేం ఎవ్వరం ఎప్పుడూ బాధ పడలేదు. వాళ్లతో సమానంగా పనిచేస్తూ వస్తున్నాం. సమానమయిన పనిగంటలు. ఈమధ్య కాలంలో పెరిగిన వెయ్యి రూపాయలతో మూడు వేల రూపాయల జీతం.

అన్నీ బాగానే ఉన్నాయి. కానీ ఈ మెమోల సంగతేమిటి? కాలేజీ అంతా కలకలం. ఎయిడెడ్ స్టాఫ్ మారు మాట్లాడకుండా జవాబులు రాసేస్తున్నారు.

నాకు చాలా కోపంగా ఉంది.

అమ్మని చాలాసార్లు అడిగాను. ఈ మేష్టరు ఉద్యోగం మానేసి ఏదేనా మంచి ఫర్మ్‌లో సైంటిస్ట్‌గా వెళ్లిపోతానని. అమ్మ వినలేదు. నెట్‌లు, స్లెట్‌లు అనే పేర్లతో ఉన్న పరీక్షలు రాయమంటోంది. గవర్నమెంటులో లెక్చరర్ ఉద్యోగాల కోసం. అంతే తప్ప "సిటీలకి వెళ్లి అక్కడ చేసే సైంటిస్ట్ ఉద్యోగాల్లో హైరాన తప్ప సుఖం లేదమ్మా" అంటుంది. కాల్ సెంటర్ జాబ్స్‌కి అసలు ఒప్పుకోదు.

వీటన్నింటికీ ఆడపిల్లనన్న భయం అమ్మకి. అందుకే ఒప్పుకోదు.

నాతోపాటు కాలేజీలో చేరిన అబ్బాయిలు ఒకటి రెండేళ్లలో వేరే చోటుకి ఉద్యోగాలు వెతుక్కుని వెళ్లిపోయారు, ఇంతకన్న మంచి జీతాలొచ్చే ఉద్యోగాలు అవి.

మళ్లీ కొత్త వాళ్లు రావడం, వాళ్లూ ఆరునెలలూ, ఏడాదీ తిరక్కుండా ఎక్కడెక్కడికో ఎగిరిపోతూ ఉండడం.... అబ్బాయిలుగా పుట్టడం ఎంత అదృష్టం అనిపించింది మొదటిసారి.

అమ్మకి ఆడవాళ్ల అసహాయత తెలుసు. ఆడవాళ్లు కావడమే ఒక పెద్ద అసహాయత; ఎన్ని అర్హతలున్నా సరే.

నాన్న మోసగించాడు. ఎప్పుడూ అలాగే జరుగుతుంది. స్త్రీలు మోసగించబడతారు. జాలి గుండె వల్ల కావచ్చు.

ఒంటరిగా నిలబడి నన్ను పెంచింది. అందుకే మళ్లీ నేనెక్కడికో ఉద్యోగం కోసం వెళ్తే అక్కడ నేను ఒంటరిని, ఇక్కడ నేను లేక అమ్మ ఒంటరిదైపోతుంది.

"కన్నా? మనకు ఈ డబ్బు చాలదా? ఎంత డబ్బున్నా చాలనంతగా అనిపించేలా వస్తువులు మార్కెట్లోకి కుప్పతిప్పలుగా వచ్చిపడుతున్నాయి. నిజమే. కాని వస్తువులు కొనుక్కునేది మన అవసరాలు తీరడానికా, లేక వాటిపట్ల మోజుతోనా? ఈ ఒక్క ప్రశ్న వేసుకోగలిగితే చాలు మన జీవితాలు స్థిమితంగా ఉండడానికి" అంటుంది.

మా ఇద్దరి జీతాలకి, మా జీవితాలు ఏ లోటూ లేకుండా గడుస్తూనే వున్నాయి.

మా సంగతి అలా ఉంచి మా కాలేజ్‌లో కెమిస్ట్రీ, జువాలజీ చెప్పే మేడమ్స్‌ని చూడాలి. వాళ్లు పన్నెండేళ్లుగా ఈ రెండు, మూడు వేల జీతానికే ఇక్కడ పని చేస్తున్నారు. వాళ్ల భర్తలు పెద్ద ఉద్యోగస్థులు. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు.

వాళ్లు చదివింది మర్చిపోకూడదని, ఒక మంచి వ్యాపకం ఉండాలని, ఈ ఉద్యోగాలలో ఇష్టపూర్వకంగా బందీలయ్యారు.

ఈవేళ సమాజంలో ఇవీ అవకాశాలు. మామూలు విద్యావంతులు కాదు, పి.జిలు చేసిన విద్యావంతులకి.

కెమిస్ట్రీ, జువాలజీ చదివిన రమ గారికి, సునీత గారికి వాళ్ల మార్కులకి ఆనాడేనాడో ప్రయత్నిస్తే మంచి కాలేజీల్లో మంచి జీతం ఇచ్చే ఉద్యోగాలే వచ్చును.

కానీ ఆడపిల్లలనేసరికి ఎంత చదువుకున్నా మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసేస్తే బాధ్యత తీరిపోతుందనుకుంటారు తల్లిదండ్రులు. పెళ్లిళ్ల తర్వాత పిల్లలు, సంసారం. కొంత వీలు చిక్కినా, ఉద్యోగం చెయ్యాలనుకుంటే ఉన్న ఊళ్లోనే చెయ్యాలి.

ఇదీ మా ఆడపిల్లల చదువుల, ఉద్యోగాల సంస్కృతి. ఇది మా కళాశాల పాలకవర్గానికి ఎంత బాగా ఉపయోగపడుతోందా! అని అనుకున్నప్పుడల్లా మిగిలిన మరెన్నో కార్పొరేట్ కాలేజీల కన్నా మా పాలకవర్గం ఎంతో మంచిది అనే దుర్మార్గపు ఓదార్పుని మాకు మేమే పొందుతూ ఉంటాం.

సరే! అంతా బాగానే ఉంది. కానీ ఈ 'లేట్ కమింగ్' గురించి వచ్చిన మెమోల సంగతేమిటి?

"జవాబు రాశావా అనిమిషా?" రమ స్టాఫ్‌రూంలోకి వస్తూ అడిగింది.

"అసలు ఈ మెమోకి మనం జవాబు ఎందుకివ్వాలి? రెండు నిమిషాలు ఆలస్యం అంత పెద్ద తప్పు కాదే" అన్నాను.

"పోనీ మానేసి చూడండి" అంది మరొక మేడం.

మానేస్తే ఏమీ కాదు. కానీ ఏమేనా అవుతుందేమోననే భయం ఈ వాతావరణంలో కల్పించబడింది.

"మెమోకి జవాబు కాదు. అసలు ఈ ఉద్యోగమే మానేస్తాను" అన్నాను.

చాలా అన్యాయం అనిపిస్తోంది ఈ ధోరణి. మా పెరడంతా గడ్డిమొక్కలు పీకి శుభ్రం చేసినందుకు రోజుకూలీ వంద రూపాయలిస్తాం ఒక మనిషికి. ఈ లెక్కన అతనికి మూడువేలు గిడుతుంది నెలకి. మా కంటే అతనే నయమేమో!

ఎంత కష్టపడి చదువుకున్న చదువులు! ఇవి! సునీత అంటోంది. "నువు ఊళ్లో ఏ కాలేజ్‌లో చేరినా ఇదే తంతు. ఇంకా ఉన్నంతలో మనవాళ్లు మంచివాళ్లు. మొన్న 'విజేతా' కాలేజ్‌లో అయితే 'లీజర్'లో కూడా కాలేజ్‌లో టిఫిన్లు తినకూడదన్నారట. ఉదయం ఏడు గంటలలోపే ఇంటి దగ్గరే తిని రావాలని సర్క్యులర్ పంపేరట. తెలుసా!" అంది.

"అదేం ఘోరం" అన్నాం అందరం ఒక్కసారిగా. అదంతే.

మన కింద పనిచేసే ఉద్యోగుల్ని ఎంతగా అణిచి ఉంచితే అంత భయభక్తులతో పనిచేస్తారు. కార్పొరేట్ సంస్కృతి తయారుచేసిన సూత్రాలు ఇవి. టిఫిన్ పేరుతో ఇటు ఐదు నిముషాలు, అటు అయిదు నిముషాలూ 'లీజర్' వాడుతున్నారని కంప్లైంట్.

ఆ కాసేపట్లో మిగతా కాలేజీల్లో నియమాల వైఖరి గురించి చాలా చాలా మాట్లాడేరు అందరూ.

కానీ ఎవ్వరూ ఇక్కడి ఈ అధిక పనిగంటలు, ఈ నామమాత్రపు జీతంతో చేసే ఉద్యోగాలు మానరు, ఎందుకో! మరి!

మా మగ కొలీగ్స్ ఈ ఉద్యోగం మీదే ఆధారపడి ఉండరు. బయట ట్యూషన్లు, కోచింగ్స్ లాంటి ఎన్నో వాటిలో ఎంగేజ్ అయిఉంటారు. మాకు అవేవీ కుదరవు. టైమింగ్స్ కుదరదు. రాత్రి తొమ్మిది దాటితే భద్రత భయం. అంటే భద్రత ఉండదని భయం. ఈ చదువుకున్న శాస్త్రమంతా ఏం చేసుకోవాలో తెలీదు. నిజంగానే ఉద్యోగం మానెయ్యగలనా?

ఆ ఉదయం ఎప్పటిలాగానే నాలుగు గంటలూ క్లాసు చెప్పాను. ఎంతో శ్రద్ధగా వినే విద్యార్థుల్ని చూసినప్పుడు అన్నీ మర్చిపోయి పాఠంలో లీనం అయిపోవడం ఎంత సంతోషాన్నిస్తుంది? ఈ సంతోషాన్ని ఎన్ని వేలతో విలువ కట్టగలం?! ఇది కార్పొరేట్ సంస్థల్ని నడుపుకునే బడా వ్యాపారస్తులకి అర్థమవుతుందా?!

ఆఖరి పీరియడ్. బెల్ అయిపోయింది. ప్రోబ్లం మధ్యలో ఉందని పూర్తి అయేదాకా ఆగాను. మరో పది నిముషాలు పట్టింది. క్లాసులోంచి బయటకు వస్తోంటే పక్కన కామర్సు క్లాసు జరుగుతోంది. వినయా మేడమ్ బోర్డు మీద లెక్క వేస్తున్నారు, సమ్ పూర్తయితేనే కాని అమె మధ్యలో క్లాస్ వదలరు.

మాకా లేట్ మెమోలు ఇవ్వవలసింది? మధ్యాహ్నం కూర్చుని ఇదే జవాబు రాశాను. పెద్ద జవాబు. "పని గంటలు నియామకం పెట్టినప్పుడు మీకు మా వేతనాల పట్ల దృష్టి ఉందా? మా చదువుల్లో నాణ్యత, మా విద్యాబోధనల్లోని స్పష్టత గురించి మీకేమయినా తెలుసా? ముఖ్యంగా మేం ఆడవాళ్లం ఎందుకు మీ సంస్థల్ని వదలకుండా ఇలా సేవ చేస్తున్నామో ఊహించగలరా?" అంటూ.

ఇదీ బుట్టదాఖలా అయిపోతుందని నాకు తెలుసు. ఈ విద్యా పారిశ్రామికరంగం పెద్ద ఎత్తున కొనసాగాలంటే, మేం ముఖ్యంగా పెద్ద చదువులు చదువుకునీ గోళ్లు గిల్లుకుంటూ పొరుగూరికి వెళ్లలేని ఆడవాళ్లం ఎంతో బాగా పనికివస్తాం.

మేం విద్యలో పరిశ్రమిస్తే వీళ్లు మాతో పరిశ్రమ నడుపుతున్నారు.

పాలకవర్గాలన్నింటికీ తెలుసు. పురుషాధిపత్య సమాజంలోని పాలకవర్గాలకి మరీ బాగా తెలుసు. బాధ్యత భుజానికెత్తుకోవడంలో ఈ ఆడవాళ్లకి ఎంత పిచ్చి ఆనందమోనని.

× × ×



హైదరాబాద్, చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ మినీహాల్‌లో 'చెలిమి' సాంస్కృతిక సమితి ది:23-3-2009న ఏర్పాటు చేసిన 'విరోధి' నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రధాన సభలో శ్రీ దైవజ్ఞ శర్మ నుండి పురస్కారాన్ని స్వీకరిస్తున్న విజయవాడ వాసి సాహిత్య రత్న శ్రీ కె.ఎస్. రామారావు. చిత్రంలో వరుసగా ఎడమనుండి శ్రీ పి.ఎం. సుందరరావు, కళాదీక్షితులు, ఎల్.వి. సుబ్రహ్మణ్యం, కె. ఎస్. రామారావు, దైవజ్ఞశర్మ శ్రీ గుండు సుదర్శన్, శ్రీ సుధామ మరియు డా॥ వద్దేపల్లి కృష్ణ.

సరిగ్గా నెల్లాళ్ల తర్వాత కాలేజీ ఉద్యోగానికి రిజిగ్నేషన్ ఇస్తుంటే "మూడు నెలల ముందు చెప్పాలండీ ఇప్పటికిప్పుడు మాకు కొత్తవాళ్లు ఎక్కడ దొరుకుతారు" అంటున్నాడు కరస్పాండెంట్.

నీ ఇష్టం- ఏమేనా చేసుకో అని మనసులో అనుకుని నా ఒరిజినల్ సర్టిఫికెట్లు నా దగ్గరికి వచ్చేదాకా నెమ్మదిగా మేనేజ్ చేసుకుని బయటికి వచ్చేశాను. డి.ఆర్.డి.ఎల్.లో పదిహేను వేల రూపాయల జీతంతో ఉద్యోగం. జీతంతో పాటు చదువుకున్న చదువుకి గుర్తింపు.

అమ్మ ముందు వద్దంది. కానీ ఆమె ఆలోచనకూ, నా ఆలోచనకూ పెద్ద అంతరం లేకపోయినా. ఈ విషయంలో మాత్రం ఆమెకు నేనే ధైర్యాన్ని ఇవ్వవలసి వచ్చింది.

"అమ్మా! ఈ లోకంలోనికి ఒంటరిగానే వచ్చాం. కానీ వచ్చేక మన చుట్టూ ఇంతమంది పోగుపడ్డారు. మన గుండెలో కదలిక, గుండెకి నిబ్బరం ఉన్నంత కాలం మనం ఒంటరివాళ్లం కాము" అన్నాను.

"నిన్ను వదిలి ఉండలేనురా తల్లిగా" అంది.

"ఇప్పటికి ఎంత మంది విద్యార్థులకు చదువు చెప్పేవో వాళ్లంతా నీ పిల్లలు కాదా! తెల్లారి లేచి నీ క్లాస్‌లో నీ చుట్టూ వున్న పిల్లలందరిలోనూ నన్ను చూసుకోమని నేను నీకు చెప్పక్కర్లేదు. మాటిమాటికీ వస్తూనే ఉంటానుకదమ్మా" అంటూ ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి గారాలు పోయాను.

అమ్మ స్త్రీగా శక్తివంతురాలే గానీ తల్లిగా బలహీనపడింది. ఇది కూడా మంచిది కాదమ్మా అని నేనే చెప్పాలి, నెమ్మదిగా.

నా బట్టలు సర్దిపెట్టింది. "నేను ఒంటరిగా ఉండను. హాస్టల్‌లో ఉంటానని ఒప్పించాను."

× × ×

హాస్టల్ నేను అనుకున్నట్టు లేదు. ఇంటి దగ్గర అమ్మా, నేనే. అన్నిటికీ ఎంతో స్వేచ్ఛ. ఇక్కడ గదిలో నలుగురం ఉన్నాం. రకరకాల స్వభావాల, ఉద్యోగాల తాలూకు సంస్కారాల లేదా కుసంస్కారాల మధ్య మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను.

మా ఊళ్లో తగుపాళ్లలో ఉన్న కార్పొరేట్ సంస్కృతి ఇక్కడ విజృంభించి ఉంది. కోచింగ్ సెంటర్లూ, కార్పొరేట్ విద్యాసంస్థలూ షాపింగ్ మాల్స్‌ను తలదన్నేలా ఉన్నాయి.

నాది ప్రభుత్వ సంస్థ కావడంతో అదృష్టవశాత్తూ ఆ బురద నాకు అంటడం లేదు. కానీ నా చుట్టూ ఉన్నవాళ్లంతా ఆ బురదలో కూరుకుపోయిన వాళ్లే.




నా రూంలో ఉంటున్న దివ్య ఒక ప్రైవేట్ టి.వి.ఛానల్‌లో పనిచేస్తోంది. రోజూ కూలీ లాంటి జీతం. నెలకి పదివేలూ, పన్నెండువేలూ అలా వస్తాయి. ఒక్కొక్కసారి పదిహేను దాకా వస్తాయి. ఒకసారి తన కొలీగ్‌ని తీసుకొచ్చింది రూమ్‌కి. ఆమెకు ముప్ఫయివేలు జీతంట. విడిగా ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటోందిట. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటుండగా తెలిసిన సంగతి వాళ్ల హెడ్‌కి ఎనభైవేలు జీతం అని. ఆమె కూడా మహిళే.

నాకు ఒక విషయం అర్థమయింది. మా ఊరి కాలేజీకి ఇక్కడ వాతావరణానికీ ఒక తేడా ఉంది. ఇక్కడ తెలివి, చురుకుదనం, లేదా వాటితో పాటు అందం అన్నవాటిని పెట్టుబడిగా పెడితే చెల్లుబాటు అవుతుంది. కష్టపడి పనిచెయ్యగలిగినా ఫరవాలేదు.

ఆ మాటే వాళ్లతో అన్నాను.

కానీ వాళ్లు నా మాట ఒప్పుకోలేదు కానీ ఆలోచనలో పడ్డారు.

"మీ ఆఫీసులో పని గంటలు ఎన్ని" అని అడిగింది దివ్య చెప్పాను.

సెలవుల గురించి కూడా అడిగి తెలుసుకుంది. ఉద్యోగభద్రత గురించి విని ఆశ్చర్యపోయింది.

అప్పుడు చెప్పింది తనూ, తన స్నేహితురాలూ నెలకి ఒకసారి గ్యాస్ట్రో, ఎంట్రాలజిస్టుని ఎందుకు కలుస్తారో! తమ మానసిక వత్తిడి ఏమిటో? ఎందుకోతో సహా.

ఏ రోజూ సెలవు వుండదు. సెలవుకి జీతం కట్ చేస్తారు. నాలుగు రోజులు వరుసగా మానేస్తే పని పెరిగిపోతుంది. నేర్పు నిరూపించకపోతే ఉద్యోగమే పోతుంది. ఇందుకే గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు అవసరం.

అయినా సరే తెలివికి, నేర్పుకి, చురుకుదనానికి డిమాండ్ ఉంది కదా! అన్నాను. అనుకున్నాను.

కానీ ఆ రాత్రి అంతా ఈ చదువులు, ఉద్యోగాలు, జీతాలు నా ఆలోచనలని వదలలేదు.

ఈ లోకంలో అందరికీ తెలివి సమానంగా ఉంటుందా.

అందరూ ఎంతో చురుగ్గా పనులు చేసెయ్యగలరా?

అందరూ ఒకేలాగ శ్రమపడిపోగలరా?

అలా కాని వాళ్లని ఎన్ని కోచింగ్ సెంటర్లు యంత్రాల్లాగ మిషన్లు అతికేసి మార్చేయ్యగలవు?

ఇవేవీ లేనివాళ్లు ఈ ప్రపంచంలో ఎలా బతకాలి?

మర్నాడు అమ్మ వచ్చింది నాతో రెండు రోజులుంది. పరుగులన్నీ చూసింది.

అమ్మ ఎంతో తెలివైనది. తెలివి చాలా మందికి ఉంటుంది. అదొక్కటే కాదు. వివేకి కూడా.

అమ్మా, నేనూ 'ఐమాక్స్' థియేటర్‌కి వెళ్లాం. అక్కడ సందడి చూసి అమ్మ సరదాపడింది నిజంగానే. "ఎంత ఉత్సాహం ఉంటుంది యువతలో కన్నా" అంది.

మేం పైకి వెళ్లాలి ఎస్కలేటర్ ఒక వైపు, మెట్లు ఒక వైపు ఉన్నాయి. అమ్మ మెట్ల వైపు నడుస్తూ అంది.

"చూశావా! పైకి వెళ్లడానికి ఛాయిస్ ఉంది. ఎంపిక నీ చేతిలో ఉంది. ఏదయినా ఒకే చోటికి తీసికెడుతోంది. ఎలా వెళ్లినా నువు అక్కడికి వెళ్లేక అందరితోనూ కలుస్తావు. కానీ ఎస్కలేటర్ మీద కాకుండా మెట్లు ఎక్కడానికి ఇందరిలో నామోషీగానో, చిన్నతనంగానో భావిస్తావు చూడు అక్కడ ఉంది ఈ సమాజం తాలూకు వైఫల్యమంతా" అంది.

అమ్మ ఒక్కమాటలో తేల్చి పారేసింది.

నిజమే ఎస్కలేటర్ ఫెయిలవవచ్చు గాని మెట్లదారి విఫలం కాదు.

ఈ నగరంలో ఈనాటి పగళ్లు, రాత్రులూ చూస్తూ, అవి వెలవెలపోవడం చూస్తూ పరుగు ఆగవచ్చు గానీ నడక ఆగదు కదా అనుకున్నాను. ఆగుతూ, ఆగుతూ ఉన్న పరుగులకు దిగులు కలగలేదు.

అమ్మ మాటలు అలా అలా గుర్తొస్తూనే ఉన్నాయి.